క్లుప్తంగా

రైల్వే గేటు వద్ద స్థల పరిశీలన



ఐరన్‌గల్ సమీపంలో రైల్వే గేటు వద్ద స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ పి.మురళి

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామ సమీపంలోని రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం తహసీల్దార్ పి.మురళి స్థల పరిశీలన చేశారు. బుధవారం జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇటీవల కొత్తగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన రైల్వే గేటు వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. డీటీ రుద్రగౌడ, సర్వేయర్ బసవరాజు, వీఆర్వో బసవరాజు వెంట ఉన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న వాల్మీకి న్యాయవాదులు

ఆదోనిరూరల్: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆదోని పట్టణంలో ఉమ్మడి జిల్లా వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమావేశం జరిగింది. జిల్లాలోని వాల్మీకి జనాభా ప్రాతిపదిక ఆధారంగా అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులకు 8 ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కేటాయించాలని ఆ సంఘం నాయకుడు నాగభూషణంనాయుడు డిమాండ్ చేశారు. అలాగే వాల్మీకులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం కర్నూలు, డోన్, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, ఆదోని బార్ అసోసియేషన్‌కు సంబంధించి వాల్మీకి న్యాయవాదులు గోపాలకృష్ణుడు, పద్మజనాయుడు, భాస్కర్‌నాయుడు, ఆనంద్, అర్జున్, వీరేష్, వెంకటేష్‌తో పాటు మరో 30 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



మంత్రాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రాలయం నియోజకవర్గంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పరిమళ పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను ఆర్వో మురళీ పరిశీలన చేశారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు, భద్రత పలు అంశాలపై చర్చించారు. ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డీటీ శశిశేఖర్, సర్వేయర్ అబ్దుల్ వహీద్, వీఆర్వో భీమన్నగౌడ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ఆదోని సెంట్రల్: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో జరిగింది. సదస్సులో ఆర్టీసీ డిపో మేనేజర్ ఎండీ రఫీఖ్ మాట్లాడుతూ.. రోడ్డు మీద నడిచివెళ్లేటప్పుడు ఎడమ వైపు ఫుట్‌పాత్ మీద మాత్రమే నడవాలన్నారు. ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు రోడ్డు సంకేతాలను గమనిస్తూ ఉండాలన్నారు. రోడ్డు క్రాస్ చేసే సమయంలో వాహనాల రాకపోకలను గమనిస్తూ అప్రమత్తంగా రోడ్డు క్రాస్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రతలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. ఎంఫ్ వేణుగోపాల్, ఎస్‌టీఐ రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10న సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కన్నడ సంఘం అధ్యక్షుడు శరణబసవ

ఆదోనిఅర్బన్: ఈనెల 10వ తేదీన ఆదోని పట్టణంలోని వీరశైవ లింగాయతీ కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆదవాని కన్నడ సంఘం అధ్యక్షులు శరణబసవ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో నివసించే కన్నడ భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కన్నడ సంఘం ఉపాధ్యక్షులు యగ్గటి ప్రతాప్, సుగూరప్ప, దేశాయి చంద్రన్న, హోతూరు విశ్వనాథ్, బండి నాగేంద్రప్ప, మరులరాధ్య, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని యార్డులో అభివృద్ధి పరుగులు

- పట్టుబట్టి మిర్చి యార్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- సరుకు కొనుగోలు చేసిన 15 రోజుల్లో నగదు చెల్లించాలని ఆదేశం
- హర్షం వ్యక్తం చేస్తున్న మిర్చి రైతులు, కమీషన్ ఏజెంట్లు
- గతంలో 45 రోజులకు పేమెంట్లు



మిర్చి యార్డును ప్రారంభించి దిగుబడిని వేలం వేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి (ఫైల్)

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణం రెండో ముంబైగా పేరుగాంచింది. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డుపై ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. యార్డులో ఆరు నెలలు సీజన్ ఉంటే మరో ఆరు నెలలు ఉండదు. ఈ ఆరు నెలల్లో ఆదోని ప్రజలు ఎంతో కొంత డబ్బును సంపాదించుకుంటారు. ఇనామ్ వచ్చినప్పటి నుంచి లావాదేవీల్లో ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు అవార్డు సాధించింది. ఆదోని చుట్టుపక్కల గ్రామాల నుంచి కార్మికులు, వ్యాపారస్థులు, కమీషన్ ఏజెంట్లు ఎంతోమందికి ఈ యార్డు వెన్నుముకలాంటిది. అలాంటి యార్డులో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మిర్చి క్రయవిక్రయాలు ప్రారంభించడంతో పాటు లావాదేవీల్లో అవకతవకలు ఉండకుండా చర్యలు చేపట్టారు.

15 రోజుల్లోనే పేమెంట్లు

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన దిగుబడులను కమీషన్ ఏజెంట్లు సంబంధిత వ్యాపారస్తుల వద్ద క్రయ, విక్రయాలు చేస్తారు. దిగుబడులు విక్రయించిన డబ్బును వ్యాపారస్తులు గతంలో 45 రోజులకు కమీషన్ ఏజెంట్లకు చెల్లించేవారు. తర్వాత వారు రైతులకు అందజేసేవారు. 45 రోజుల పేమెంట్ వల్ల సరుకు అమ్మిన వారి నుంచి ఒత్తిడి అధికం కావడంతో చాలా కమీషన్ దుకాణాలు మూతబడ్డాయి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే కమీషన్ ఏజెంట్లు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వ్యాపారులతో మాట్లాడి కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఏర్పాటు చేశారు. రైతులు తెచ్చిన దిగుబడులను కమీషన్ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసిన 15 రోజుల్లోగా డబ్బు చెల్లించాలని నిబంధన పెట్టారు. అప్పటినుంచి 15 రోజుల్లోగా లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో రైతులు, కమీషన్ ఏజెంట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఐపీలు ఎక్కువ

గత ప్రభుత్వంలో మార్కెట్ యార్డులో ఎవరికివారే యమునా తీరు అన్న చందంగా ఉండేది. పట్టించుకునే నాయకులే లేరు. బాధ్యత లేదు. చెప్పేవారు లేరు. బెదిరింపులు ఎక్కువ. 45 రోజులకు పేమెంట్ ఉండడంతో కొంతమంది వ్యాపారులు అవసరాలకు డబ్బు వాడుకొని, ఆ తర్వాత సరైన సమయానికి నగదు సర్దుబాటు చేయలేక పోయేవారు. తీరా సీజన్ అయినపోయిన తర్వాత కొంతమంది వ్యాపారులు ఐపీలు కూడా పెట్టారు. దీంతో మంచిగా వ్యాపారం చేసుకునే వారికి సరుకు దొరకడం లేదు. ప్రస్తుతం నిబంధనలు మార్చడంతో ఎవరికి ఎంత కావాలో అంతే దిగుబడులను తీసుకొని వ్యాపారులు లాభాలను చవిచూస్తున్నారు. 15 రోజుల్లోనే పేమెంట్ చేస్తుడడంతో రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబట్టి మిర్చి యార్డు

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు రాయలసీమలోనే అతిపెద్దది. ఇక్కడ అన్ని కూరగాయలు, అన్ని దిగుబడుల క్రయవిక్రయాలు జరుగుతాయి. అయితే మిర్చి యార్డు లేకపోవడం వల్ల డివిజన్ పరిధిలోని 17 మండలాల మిర్చి రైతులు గుంటూరు, కర్ణాటకలోని బ్యాడిగికి వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఒక సంచికి రూ.200 బాడిగ, రెండు రోజులపాటు నిద్రాహారాలు మానేసి రైతులు ఇబ్బందులకు గురయ్యేవారు. మిర్చిని అమ్మిన వెంటనే అక్కడి కమీషన్ ఏజెంట్లు డబ్బు ఇచ్చేవారు కూడా కాదు. దాదాపు 45 రోజులకు రైతుల అకౌంట్‌లో డబ్బు జమచేసేవారు. ఈ పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మిర్చి రైతులకు ఇబ్బంది లేకుండా ఆదోనిలో మిర్చి యార్డు ప్రారంభించాలని పట్టుబట్టారు. ఉన్నతాధికారులు, కలెక్టర్‌తో చర్చలు జరిపి 2023 డిసెంబర్ 13న ఆదోని మార్కెట్‌లో మిర్చి యార్డును ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో మిర్చి రైతులు దూరాభారం వెళ్లాల్సిన పని తప్పింది. రవాణా ఖర్చులు, సొంత ఖర్చులు బాధలు తగ్గాయని మిర్చి రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కమీషన్ ఏజెంట్లకు మేలు జరిగింది



ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చొరవతో ఆదోని మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లకు, వ్యాపారులకు, రైతులకు ఎంతో మేలు జరిగింది. గతంలో వ్యాపారులు దిగుబడులు కొనుగోలు చేసిన 45 రోజులకు పేమెంట్ చేసేవారు. దీంతో చాలా కమీషన్ ఏజెంట్ల దుకాణాలు మూతబడ్డాయి. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి 15 రోజుల్లో పేమెంట్ చేసేలా నిబంధనలు తీసుకొచ్చారు. దీని వల్ల అందరికీ మేలు జరిగింది. 500 కమీషన్ ఏజెంట్ల కుటుంబాలు బాగుపడ్డాయి. ఎమ్మెల్యేకు కమీషన్ ఏజెంట్లు తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – రాజేష్, కమీషన్ ఏజెంట్, ఆదోని

రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయం



మిర్చి రైతులు దిగుబడులను గుంటూరు, కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగికి తరలించేందుకు ఇబ్బంది పడేవారు. రవాణా ఖర్చు కూడా ఎక్కువ. రైతుల ఇబ్బందులను పరిష్కరించే దిశగా ఆదోనిలో మిర్చి యార్డును ప్రారంభించాం. ఇతర ప్రాంతాల్లో మిర్చి క్రయవిక్రయాల నిబంధనలు ఎలా ఉన్నాయో తెలుసుకుని స్థానికంగా అలానే అమలుచేస్తున్నాం. 15 రోజుల పేమెంట్ వ్యవస్థను తీసుకొచ్చాం. వ్యాపారుల తమకు ఎంత మేర దిగుబడి కావాలో అంతే కొనుగోలు చేస్తున్నారు. అందరికీ మేలు జరుగుతుంది. – సాయిప్రసాద్ రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

అన్ని ఏర్పాట్లు చేశాం



ఆదోని మిర్చి యార్డులో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. గుంటూరు, ఎమ్మిగనూరు, కర్నూలు, బ్యాడిగి, రాయచూరు, బళ్లారి నుంచి వ్యాపారులను రప్పించి టెండర్‌లో పాల్గొనేవిధంగా చర్యలు తీసుకున్నాం. యార్డులో మిర్చి క్రయవిక్రయాలు ఆది, బుధవారాల్లో మాత్రమే జరుగుతాయి. దాదాపు 2 వేలకు పైగా మిర్చి సంచులను రైతులు తీసుకొస్తున్నారు. 30 నుంచి 40 మంది వ్యాపారులు టెండర్లలో పాల్గొంటున్నారు. ఇతర మిర్చి యార్డుల్లో ఎలాంటి నిబంధనలు ఉన్నాయో అవే ఇక్కడ అమలు చేస్తున్నాం. – రామ్మోహన్ రెడ్డి, యార్డు సెక్రటరీ

ఖర్చులు మిగిలాయి



కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగి, గుంటూరులో మిర్చికి ఏ ధర ఉందో ముందే తెలుసుకున్నాను. 18 సంచుల ఎండుమిర్చిని ఆదోని యార్డుకు తీసుకెళ్లగా క్వింటా రూ.23 వేలు ధర పలికింది. అక్కడున్న ధర స్థానికంగానే పలకడం సంతోషంగా ఉంది. లేదంటే 300 కి.మీ దూరం సరుకు రవాణా ఖర్చులు, వ్యయప్రయాసలతో పాటు రెండు రోజులు వేచి ఉండాల్సిన శ్రమ తగ్గింది. ఆదోనిలో మిర్చి యార్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి, యార్డు అధికారులకు కృతజ్ఞతలు. – లక్ష్మన్న, మిర్చిరైతు, దేవనకొండ

పారదర్శకంగా ఓటరు జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించామని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ స్పష్టం చేశారు. ఆయన బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీల నాయకులు చేసిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని వివరించారు. ఓటరు జాబితాపై ఏదైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకుని రావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహసీల్దార్ హసీనాసుల్తాన్, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఎలక్షన్ ఉప తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ తనిఖీలు



పౌర సరఫరాల గోడౌన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ్ శర్మ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులు, తుకాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోడౌన్ నుంచి ప్రజలకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. లారీలకు సంచులను ఎత్తేటప్పుడు తుకాలను చూసుకోవాలన్నారు. బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్ణ, గోడౌన్ సిబ్బంది ఉన్నారు.

రాళ్లదొడ్డిలో భూముల పరిశీలన

మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ పరిశీలించారు. భూరికార్డులు, హద్దులను క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారి భూములను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. భూరికార్డులు, సర్వే పక్కాగా ఉండాలని ఆదేశించారు. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూమి హద్దులు చూపించి హద్దు రాళ్లను పాతించాలన్నారు. తహశీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్, వీఆర్వోలు షేక్షావలి, సుబ్బలక్ష్మీ తదితరులు ఉన్నారు.

దాడి కేసులో ఐదుగురికి జైలుశిక్ష

దేవనకొండ: తెర్నెకల్ గ్రామానికి చెందిన సూర్యానారాయణపై దాడి చేసిన కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.18 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పత్తికొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు వెల్లడించారని దేవనకొండ పోలీసులు తెలిపారు. వివరాలు.. 8-10-2014న సూర్యనారాయణ తన ట్రాక్టర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తుండగా ఉద్దేశపూర్వకంగా రాజు, చిన్నవెంకప్ప, తిమ్మప్ప, చిన్న హనుమంతు, రాజన్న దాడి చేసి కొట్టారన్నారు. బాధితుడు సూర్యనారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసు బుధవారం విచారణ పూర్తికాగా పత్తికొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. వారిని జైలుకు తరలించారు.

రౌడూరులో సీసీ రోడ్డు నిర్మాణం



నాడు - జెట్టప్ప తాత వీధిలో గతంలో రస్తా దుస్థితి



నేడు - సీసీ రోడ్డు నిర్మించిన తర్వాత ఇలా..

కౌతాళం: దశాబ్ద కాలం నుంచి ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రౌడూరు గ్రామంలోని జెట్టప్పతాత వీధివాసుల కల నేరవేరింది. కాలనీ ఏర్పడినప్పటి నుంచి సిమెంటు రోడ్డు లేక అవస్థలు పడుతున్న వారు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నల్లరేగడి మట్టి కావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా వీధులు బురదమయంగా మారేవి. గత ప్రభుత్వంలో సమస్యను ఎన్నిసార్లు చెప్పిన ప్రయోజనం లేకపోయింది. దీంతో గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గడప గడప నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. జెట్టప్పతాత కాలనీకి రూ.11 లక్షలతో సిమెంటు రోడ్డు, అలాగే గ్రామంలో రక్షిత మంచినీటి పథకం విద్యుత్ లైన్ మరమ్మతులు పూర్తి చేశారు. సమస్యలు పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


వైఎస్సార్ బీమా పేదలకు వరం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరంగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంతో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం రోడ్డున పడకుండా వైఎస్సార్ బీమా అండగా ఉంటుందన్నారు. వివరాలు.. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన గవిగట్టు వీరేష్ గతంలో మిద్దెపై కోతులను తోలడానికి వెళ్లి విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్మును త్వరితగతిన మంజూరయ్యేలా కృషి చేశారు. ఇటీవల బీమా సొమ్ము రూ.5 లక్షలు నామినీ బ్యాంకు ఖాతాలో జమైంది. దీంతో వారు బుధవారం ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని వై.ప్రదీప్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ బీమా లేకపోతే తమ కుటుంబం రోడ్డున పడేదన్నారు. బీమా సొమ్ము తమను ఆదుకుందన్నారు. గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, నాయకులు బ్రహ్మయ్య, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, నాయకులు

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలందరినీ సంసిద్ధం చేసేలా 'సిద్ధం' కార్యక్రమం చేపడుతున్నట్లు టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సిద్ధం పోస్టర్లను వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి చేపట్టే సిద్ధం సభకు మంత్రాలయం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాబోవు ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, బూదూరు లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలం కచ్చాపురం వద్ద అక్రమంగా కలిగి ఉన్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం కచ్చాపురం – నారాయణపురం గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం చిన్నభూంపల్లి గ్రామానికి నాగులదిన్నె రాముడు వద్ద 96 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) లభించినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.4,500 ఉంటుందన్నారు. మద్యంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ పార్కు రోడ్డులో బుధవారం బోయ సోమేష్‌పై హత్యాయత్నం జరిగింది. వివరాలు.. స్థానిక వెంకటాపురం కాలనీవాసులైన బోయ సోమేష్, రామాంజనేయులు వర్గాలకు పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో బోయ సోమేష్ బుధవారం బైక్‌పై వెళ్తుండగా మరో వర్గానికి చెందిన కుక్కల సోమేష్ అడ్డగించడంతో వాగ్వాదం ఏర్పడింది. అక్కడేఉన్న బోయ రామాంజనేయులు, వెంకటేష్, అయ్యన్న, కొండయ్య, గోవిందులు ఆగ్రహంతో బోయ సోమేష్‌పై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఇదే గొడవలో కుక్కల సోమేష్‌కు చేతికి తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు రావడంతో దాడి చేసినవారు పరారయ్యారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు బోయ సోమేష్ భార్య కేశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన



ఆదోనిలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. 23వ వార్డు శంకర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 25వ వార్డు షరాఫ్‌బజార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వేర్వేరుగా వైద్య శిబిరాలను నిర్వహించారు. శంకర్‌నగర్‌లో 450 మంది, షరాఫ్‌బజార్ వైద్య శిబిరంలో 475 మంది ప్రజలు పాల్గొని రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయాసం, దగ్గు, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఆయా శిబిరాల్లో పాల్గొని డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్సలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. కంటి ఆపరేషన్లకు అవసరమైన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు.